

నేడు చిత్తూరులో కల్యాణ్ జ్యువెలర్స్ ప్రారంభం
ముఖ్య అతిథిగా రానున్న హీరో నాగార్జున

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: దేశంలోని అత్యంత విశ్వసనీయ, ప్రముఖ ఆభరణాల బ్రాండ్లలో ఒకటైన కళ్యాణ్ జ్యువెలర్స్ చిత్తూరులోని ఎమ్మెస్ఆర్ సర్కిల్లో తమ సరికొత్త షోరూమ్ను శుక్రవారం ప్రారంభించనుంది. ఆంధ్రప్రదేశ్లో తన కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కళ్యాణరామన్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రాంతీయ బ్రాండ్ అంబాసిడర్ ప్రముఖ సినీ హీరో అక్కినేని నాగార్జున శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సరికొత్త షోరూమ్ను ప్రారంభిస్తారని చెప్పారు. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 9వ షోరూమ్ అని తెలిపారు. ప్రస్తుతం ఆభరణాల బ్రాండ్ విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి, గుంటూరు రాష్ట్రంలోని అనేక మార్కెట్లలో తన కార్యకలాపాలను నిర్వహిస్తుందన్నారు. షోరూమ్ ప్రారంభోత్సవానికి కళ్యాణ్ జ్యువెలర్స్ ఒక ప్రత్యేకమైన ప్రమోషన్ను అందిస్తోందని, కనీసం రూ. 1 లక్ష ఆభరణాలు షాపింగ్ చేసే కస్టమర్లకు నగల కొనుగోలు విలువపై 0% మేకింగ్ ఛార్జీలు అందిస్తారు.


జూన్ నెలలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన స్లిప్పు
సమస్య పరిష్కరించాలన్న తహశీల్దార్ ఆదేశాలతోనే సరి

ఈసారైనా.. పరిష్కారం దొరికేనా..!

యాదమరి మండలం 185 కాశిరాల సర్వేనెంబర్ 302/2 లో భూ సమస్య పరిష్కారం కోరుతూ గురునాథం వీర రాఘవులు 26 జూన్ 2023 వ తేదీ చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన 'స్పందన' కార్యక్రమంలో కలెక్టర్కు అర్జీ ఇచ్చారు. అర్జీ ఇచ్చి మూడు నెలలు పైగా దరఖాస్తు గడువు ముగిసినా ఇప్పటివరకు భూ సమస్య పరిష్కారం కాలేదు. గురునాథం వీరరాఘవులుకు, గాంధీ పురం గ్రామానికి చెందిన ఇరు వర్గాలకూ భూ వివాదం ఉంది. దీనిపై ఇరువర్గాలు సంవత్సరం రోజులుగా తహశీల్దార్ కార్యాలయానికి, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తిరుగుతున్నా యాదమరి రెవిన్యూ సిబ్బంది ఆ భూములను సర్వే చేసి సమస్య పరిష్కరించలేదు. దీనిని బట్టి చూస్తే 'స్పందన' అర్జీలపై యదమరి రెవిన్యూ సిబ్బంది చిత్తశుద్ధి ఏ పాటిదో అర్ధమవుతుంది. అందుకే మండలంలో శుక్రవారం జరిగే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి విచ్చేస్తున్న కలెక్టర్కు తమ సమస్య చెప్పుకునేందుకు ఇరువురూ సమాయత్తం అవుతున్నారు.

జిల్లా 'స్పందన' అర్జీలపై రెవెన్యూ నిర్లక్ష్యం
మూడు నెలలు దాటినా పట్టించుకోని వైనం
రోజురోజుకూ పెరుగుతున్న భూ వివాదాలు

ప్రజాశక్తి - యదమరి

ఇది ఒక్క గురునాథం, వీరరాఘవులు సమస్య మాత్రమే కాదు.. మండలంలో ఇలాంటి సమస్యలతో ప్రతిరోజూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతుల సంఖ్య అధికంగానే ఉన్నాయి. రెవెన్యూ శాఖలో రికార్డులు నిర్వహణలో చోటుచేసుకుంటున్న అక్రమాలు అధికారుల తప్పిదాలకు అనేకమంది రైతులు ఇబ్బంది పడుతున్నారు. తమ భూములను కాపాడుకోవడానికి రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు రీసర్వే కార్యక్రమాలు, స్పందన కార్యక్రమాలు, జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా మండల కేంద్రంలోని రైతు దగ్గరకు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించి వారి సమస్య పరిష్కరించే దిశగా మండల కేంద్రాల్లోని జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంకు జిల్లా కలెక్టరే మండల స్థాయి కార్యక్రమాలకు హాజరై వారి సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమం ద్వారా ఈసారైనా మండల పరిధిలోని రైతు సమస్యలకు పరిష్కారం దొరికేనా అంటూ రైతులు ఎదురుచూస్తున్నారు.

పేర్ల నమోదుకు సహకరించని విలేజ్ సర్వేయర్స్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అసైన్మెంట్ కమిటీ లో పేర్లు నమోదు చేసుకోవాలంటే ముందుగా రైతు అనుభవిస్తున్న భూమి పూర్తిస్థాయిలో సర్వే చేసి సర్వే చేసిన దాన్ని రైతు భూమి ఆధారంగా సబ్ డివిజన్ స్కెచ్ వేసి స్క్రూటీ చేసిన తర్వాతనే తాసిల్దార్ అసైన్మెంట్ కమిటీలో పేరు నమోదు చేసేందుకు వీలుంటుంది. అయితే విలేజ్ సర్వేయర్స్, కమ్యూనిటీ సర్వే సర్వేయర్సు రైతుల భూముల సర్వే రికార్డులు సకాలంలో అందించక పోవడం తోనే చాలామంది రైతుల భూములను అసైన్మెంట్ కమిటీలో పేర్లు నమోదు చేయడం లేదని గ్రామ రెవెన్యూ అధికారులు వాపోతున్నారు. చాలామంది రైతులు 10 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములు గాని సర్వేయర్లు భూములు కొలిచి ఇవ్వకపోవడంతోని అసైన్మెంట్ కమిటీలు పేర్లు నమోదు కాలేదు. సర్వేయర్ల వెనుక ఎన్నిసార్లు రైతులు తిరిగినా వారు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో ఇటీవల కాలంలో భూ అక్రమాలు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటున్నారు. ఇటు అధికారులు అక్రమదారులతో చేతులు కలిపి భూముల రికార్డులను వారికి అనుకూలంగా మార్చేస్తున్నారు. సోమవారాల్లో జిల్లా సచివాలయం, మండల కేంద్రాల్లో నిర్వహించే స్పందన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాల్లో వచ్చే వినతుల్లో 70 నుంచి 80శాతం వినతులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే. ఇందులోనూ 90 శాతం భూ వివాదాలే. పరిష్కరించదగిన సమస్యలను ఏళ్ల తరబడి సాగదీయడం రెవెన్యూ శాఖకి దక్కిన ఘనత.

భూ పంపిణీ రికార్డులు మాయం

యాదమరి మండలంలో 2009 - 2014 సంవత్సరం మధ్యలో ఒకటి నుండి ఐదు, ఆరు, ఏడు విడతలలో మొత్తం 579 మంది రైతులకు గాను 741.61 ఎకరాల భూమిని పంపిణీ చేశారు. ఈ రికార్డులు యాదమరి తాసిల్దార్ కార్యాలయంలో కొంత వరకు మాత్రమే ఉన్నాయి. మిగిలిన రికార్డులు ఎక్కడున్నాయో రెవిన్యూ అధికారులకే తెలియాల్సి ఉంది. రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో అందుబాటు లేక. భూ పంపిణీలో ఇచ్చిన పుస్తకాలు చాలావరకు భూములను ఆన్లైన్ నమోదు చేసుకోలేక పోయారు. ఆన్లైన్లో లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి పొందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే ద్వారా అయినా తమ భూములను గుర్తించి ఆన్లైన్ లో నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.

వైసిపిలో గ్రూపులు

నలుగురు కార్పొరేటర్లపై చర్యలు
నియోజకవర్గ పట్టుకై ఆధిపత్య పోరు

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్

అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చిత్తూరు నియోజకవర్గంలో గ్రూపులు మరో మారు భగ్గుమన్నాయి. నియోజకవర్గంలో ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో ఎంఎల్ఏ, ఎపిఎస్ ఆర్టిసి వైఎస్ ఛైర్మెన్ విజయానందరెడ్డి గ్రూపులకు చెందిన పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు వేరు వేరుగా నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు బలనిరూపన ఈ రెండు గ్రూపుల మధ్య సాగుతోంది. చిత్తూరు ఎంఎల్ఏ స్థానానికి జరుగుతున్న ఆధిపత్య పోరుగా అధికార పార్టీ నాయకుల్లో చర్చ సాగుతోంది.

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో మరో మారు నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం వేదికగా మారింది. చిత్తూరు నగర పాలిక సంస్థలో అధికార వైసిపికి 47 మంది కార్పొరేటర్లున్నారు. ఒక స్వతంత్ర అభ్యర్థి లక్ష్మణ్ వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. ఇద్దరు కార్పొరేటర్లు మాత్రమే ప్రతిపక్ష తెలుగుదేశం కార్పొరేటర్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కార్పొరరేటర్లు రెండు గ్రూపులుగా ఉంటూ ఎంఎల్ఏ, ఎపిఎస్ ఆర్టిసి వైఎస్ ఛైర్మెన్ మద్దతుదారులుగా మారిపోయిన పరిస్థితి ఉంది. నగర పాలక సంస్థలో బిల్లుల ఆమోదానికి ఓ గ్రూపు ఓకే చేస్తే మరో గ్రూపు వ్యతిరేకిస్తోంది. దీంతో నగర అభివృద్ధి కోసం చేపట్టాల్సిన పనులు ఆమోదం పొందలేకపోతున్నాయి. నగరంలోని సమస్యలను చర్చించి కౌన్సిల్ ఆమోదంతో అభివృద్ధి పనులు చేయాల్సిన నగర పాలక సంస్థ అధికారులకు ఇబ్బందికరంగా మారిందంటూ విమర్శలున్నాయి.

భగ్గమన్న విబేధాలు

బుధవారం నగర పాలక కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్ల మధ్య విబేదాలు మరో మారు భగ్గమన్నాయి. సాధారణ నిధుల నుండీ ప్రతి డివిజన్కు రూ. 50 లక్షలు మంజురు చేయాలని ప్రభుత్వం నుండీ నిధులు మంజురైయ్యాయి. కనీస మౌళిక వసతులకు నోచుకొని మురికివాడలు- రోడ్లు, డ్రైనేజీలున్న డివిజన్స్కు ఒకే రకంగా నిధులు మంజురు చేయడంపై ఓ వర్గం కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందని డివిజన్లకు డ్రైనేజి, రోడ్లు, వీధిలైట్లు ఇతర అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు ఎక్కువశాతం కేటాయించాలని ఓ గ్రూపు పట్టుబడితే, సమానంగా కేటాయించాలంటూ మరో గ్రూపు కార్పొరేటర్లు పట్టుబట్టారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో రెండు వర్గాలుగా విడిపోయిన కార్పొరేటర్లు నిధుల కేటాయింపుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మేయర్ పోడియం వద్ద నిరసన తెలిపారు. ఉదయం 10 గంటల నుండీ మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశం అర్ధతరంగా ముగిసింది. అధికార పార్టీ ప్రముఖ నాయకుడి మద్దతుదారులు తమ డివిజన్లకు అన్యాయం జరుగుతోందంటూ నగర కమిషనర్కు వినతి చేశారు.

మంత్రి పెద్దిరెడ్డి దృష్టికి

బుధవారం నగర పాలక సంస్థలో చోటు చేసుకున్న పరిణామాలను ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు తన అనుచర కార్పొరేటర్లను వెంటబెట్టుకొని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకుపోయారు. చిత్తూరు నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను అడ్డకుంటున్నారంటూ మంత్రికి ఫిర్యాదు చేశారు. పార్టీ నిబంధనలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయడంతో పాటు కౌన్సిల్ సమావేశాన్ని అడ్డుకొని నగర మేయర్ పట్ల అమర్యాదగా ప్రవర్తించి పోడియం వద్ద నిరసన తెలిపారంటూ మంత్రికి వివరించారు. సీరియస్గా తీసుకున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికార పార్టీ డిప్యూటీ మేయర్ రాజేష్కుమార్రెడ్డి, కౌన్సిలర్లు శ్రీకాంత్, గడ్డం రమణ, ఇందు లను పార్టీ నుండీ సస్పెండ్ చేయాలంటూ ఆదేశించిన్నట్లు గురువారం వీడియో క్లిపింగ్స్ సోషియల్ మీడియాలో హల్చల్ చేశాయి. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు రాజేష్కుమార్రెడ్డి, శ్రీకాంత్, గడ్డం రమణ, ఇందు లకు వైకాపా జిల్లా ఇన్చార్జి, ఎంఎల్సీ భరత్ పార్టీ నుండీ షోకాజ్నోటీసులు జారీ చేయడం అధికార పార్టీలో అలజడి రేపుతోంది.


నగర కమిషనర్కు వినతి పత్రం అందిస్తున్న ఓ వర్గం కార్పొరేటర్లు

23వ రోజుకు డెయిరీ కార్మికుల దీక్షలు

చిత్తూరు అర్బన్: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట విజయ సహకార డెయిరీ కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు గురువారానికి 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికుల యూనియన్ నాయకులు మాట్లాడుతూ డెయిరీ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలపై కలెక్టర్ స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు రిలేదీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



ఎస్హెచ్జి గ్రూపులు బ్రాండ్ అంబాసిడర్లు : కలెక్టర్

ప్రజాశక్తి - చిత్తూరు

స్వయం సహాయక సంఘాల నిర్వహణలో చిత్తూరు జిల్లా మెరుగైన స్థానంలో ఉందని, ఇదే స్పూర్తిని కొనసాగించి జిల్లాను మెరుగైన స్థానం లో నిలపాలనికలెక్టర్ ఎస్. షన్మోహన్ అన్నారు. గురువారం చిత్తూరులోని డి ఆర్ డి ఏ సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య మహాజన సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్. షన్మోహన్ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు ధీటుగా మారుతున్న మార్కెటింగ్ పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన కొత్త ఉత్పత్తులను తయారు చేయాలని, అందుకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా తయారు చేస్తున్న ఆహార పదార్థాలు రుచి తో పాటు ఆరోగ్య పరంగా, ఎక్కువ రోజులు నిలువ ఉండేలా చూసుకుంటే మార్కెటింగ్ పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. తయారీ విధానంలో మెళకువలు నేర్చుకొనుటకు పొరుగు రాష్ట్రాలలో వ్యాపార విధానాలు, తయారీ విధానాలపై అవగాహన కొరకు ప్రభుత్వం తరపున సహాయం చేస్తామని తెలిపారు. చిత్తూరు లోని అమూల్ డెయిరీ ద్వారా అమూల్ పాల వెల్లువ ద్వారా పాలను కొనడంతో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా లాభ పడవచ్చునని తెలిపారు. తమ ఉత్పత్తుల ద్వారా ఎస్ హెచ్ జి గ్రూప్ లు జిల్లాకు బ్రాండ్ అంబాసిడర్ లు కా వాలని, నూతన ఆలోచనలతో ముందుకెళ్ళి రానున్న కొత్త సంవత్సరంలో జిల్లా లో ఒక పెద్ద పరిశ్రమను స్థాపించే స్థాయికి వెళ్లాలని ఆశిస్తున్నానని తెలిపారు. డి ఆర్ డి ఏ పిడి తులసి మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు మహిళా మార్ట్ లు విజయవంతంగా లాభాల బాటలో పయనిస్తున్నాయని, చేతివత్తుల కళాకారులను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకున్నామని, పసుపు ప్రాసెసింగ్ యూనిట్ విజయవంతంగా కొనసాగుతున్నదని తెలిపారు. జిల్లాలో 150 సంఘాలకు ప్రత్యేక రుణాలు అందించి చిన్న వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపట్టామన్నారు. పొరుగు రాష్ట్రాల్లో వ్యాపార కార్యక్రమాలపై సంఘ సభ్యులకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో డిఆర్డిఏ ఆధ్వర్యంలో 74 పాలశీతలీకరణ కేంద్రాలు పనిచేస్తున్నాయని, వీటి ద్వారా 25 వేల కుటుంబాలకు మంచి ఆదాయం వస్తున్నదన్నారు. సబ్సిడీతో దానామతంతో పాటు, జొన్న, మొక్కజొన్న విత్తనాలను సైతం అందిస్తున్నామని, దీని ద్వారా పాల దిగుబడి పెరిగే అవకాశం ఉందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే డిఆర్డిఏ సహకారంతో పాడి పరిశ్రమ పై ఆధారపడిన గ్రామీణ ప్రాంత సంఘ సభ్యులకు రాయితీతో చాప్ కట్టర్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే నాటు కోళ్ళు, మేకలు, గొర్రెలు పెంపకానికి కూడా రాయితీతో కూడిన రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు.

ఈ సమావేశంలో ఏపీడి రవి, డిపిఎం లు వెంకటేష్, రవికుమార్, ఏజీఎం ప్రకాష్, ఏపీఎంలు మధుసూదన్, సూరి, అరుణ, హేమ, అనురాధ, ఖాదరవల్లి, శంకర్ జిల్లా సమాఖ్య ప్రతినిధులు మంజుల, జయశ్రీ, నూర్జహాన్, జమున, చంద్రకళ పాల్గొన్నారు.



ప్రజారోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యం : ఎంఎల్ఎ

చిత్తూరుఅర్బన్ : ప్రజల ఆరోగ్యం కోసమే "జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. చిత్తూరు నగరపాలక సంస్థ కాజూరు పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో బీఎస్ కన్నన్ పాఠశాల ఆవరణంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ ఎస్ అముద, కమిషనర్ డా. జె అరుణ పర్యవేక్షించారు. వైద్య శిబిరంలో ఏర్పాటుచేసిన కౌంటర్లను సందర్శించి రోగులకు అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విభాగాల వారీగా అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు సంతప్తికర స్థాయిలో వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. రోగుల పరీక్ష కేంద్రంలో ఎమ్మెల్యే బిపీ పరీక్ష చేయించుకున్నారు. వైద్య శిబిరానికి రాలేనివారిని అంబులెన్స్ వాహనాల్లో వారి ఇంటి వద్ద నుంచి తీసుకొచ్చి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసి తిరిగి ఇంటివద్ద వదిలారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతీదేవి, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ రాంగణేష్, సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్వో డా.లోకేష్, సీఎంఎం గోపి పాల్గొన్నారు.


జగనన్న సురక్ష కార్యాక్రమంలో చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారుల జాప్యానికి నిరసనగా చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన జరిగింది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్.నాగరాజు మాట్లాడుతూ కార్మికులు తక్కువగా ఉన్నచోట ఎక్కువగా ఉన్న కార్మికులను మార్పు చేసి కార్మికులకు పని భారం తగ్గించాలని ,కార్మికులను మార్పు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వల్ల పనిభారం తో కార్మికులకు కష్టతరంగా ఉందన్నారు. వినతిపత్రాలు సమర్పించినా అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే నిరసన చేశామన్నారు. రెయిన్కోట్ ఇవ్వాలని, యూనిఫాం, సోపు, నూనె, చెప్పులు ఇవ్వాలని, మృతుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్కు వినతిపత్రం సమర్పించారు. విసి గోపీనాథ్, కె.మణి, డి.దొరస్వామి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి

చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఓ ప్రభావతి దేవి ఆదేశాలతో చిత్తూరు జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పాత జిల్లా లోని మలేరియా సబ్ యూనిట్ అధికారుల సమావేశం వైద్య ఆరోగ్య శాఖ నందు నిర్వహించారు. వర్షాబావ పరిస్థితులతో అక్కడక్కడ జ్వరం కేసులు నమోదు అవుతున్నాయి. కావున సబ్ యూనిట్ అధికారులు వారికి సంబంధించిన ఏరియాలలో పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. బోధకాలు బాధితులకు ఐఇసి మాత్రల పంపిణీపై దిశ నిర్దేశం చేశారు. ప్రతి అధికారి మీకు సంబంధించిన ఏరియాలో బాధ్యతతో విధులు నిర్వహించాలని తెలిపారు

శెట్టిపల్లి ప్లాట్లు కేటాయించండి : సిపిఎం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

శెట్టిపల్లి భూసమస్యపై ఎంఎల్ఎ భూమన కరుణాకర్రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్రెడ్డిల స్పందన వల్ల పెండింగ్లో ఉన్న ప్లాట్ కొనుగోలుదారుల దీర్ఘకాలిక కల నెరవేరనుందని, అయితే ఆలస్యం కాకుండా ప్లాట్లు కేటాయించాలని సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం కోరారు. సిపిఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం శెట్టిపల్లిలో ల్యాండ్పూలింగ్ కింద ప్లాట్ కొనుగోలుదారుల నుంచి, రైతుల నుంచి ప్రభుత్వ భూమిని తీసుకుందని, శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో సిఎం దృష్టికి, మంత్రులు, ఎంఎల్ఎల దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లామన్నారు. భూమన అభినయ్రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల వాతావరణం వస్తుండడంతో త్వరితగతిన భూ సమస్యను పరిష్కరించి ప్లాట్దారులకు ప్రొసీడింగ్స్ ఇవ్వాలని కోరారు. ప్లాట్దారుల సమస్య పరిష్కరించి శెట్టిపల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. కలెక్టర్ జోక్యం చేసుకుని శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కె.వేణుగోపాల్, పి.బుజ్జి, ఎండి శ్రీనివాసులు, ఆర్.మల్లికార్జునరావు, పి. హేమలత పాల్గొన్నారు.



ప్రజాశక్తి-వెంకటగిరి

వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ జాతర జన జాతరగా మారింది. గురువారం అమ్మవారి ఊరేగింపుతో రాజావీధి దద్దరిల్లింది. బుధవారం అర్ధరాత్రి కుమ్మరివీధిలోని అమ్మవారిని ప్రతిమను తయారుచేసి అత్తారింటివారైన జీనిగలవారివీధిలో అమ్మవారికి కళ్ళు దిష్టిచుక్కపెట్టి అక్కడ నుండి ఊరేగింపుగా అమ్మవారిగుడి నుండి గురువారం తెల్లవారుజాము నుండే భక్తుల దర్శనార్ధం పెట్టారు. సాంప్రదాయం ప్రకారం వెంకటగిరి రాజాల నుండి సారె అమ్మవారికి అందజేశారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురమల్లి రామ్కుమార్రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వెంకటగిరి రాజాలు అమ్మవారికి పూజాసామాగ్రిని అందజేశారు. గురువారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో అమ్మవారిని ప్రత్యేక రథంపై ఊరేగింపుగా రాజావీధి మీదుగా కాశీపేట, శివాలయంవీధి మీదుగా మల్లమ్మగుడి ప్రాంతంలో నిమజ్జనం చేశారు. వెంకటగిరిరాజా కుటుంభీకులు సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర రాజానగిరి నుండి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునే వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. వికలాంగులు, చిన్నబిడ్డ తల్లులకు ప్రత్యేక క్యూలైను ఏర్పాటు చేసి పోలీసులు స్వయంగా కొంతమందిని వికలాంగులకు దర్శన భాగ్యం కల్పించారు. ఎన్నడూ లేనివిధంగా జాతర ప్రశాంతంగా జరిగేందుకు సిసి కెమారాలు ఏర్పాటు చేయడంతో ఆకతాయిలు జాగ్రత్త పడ్డారు. చోరీలు దాదాపు తగ్గుముఖం పట్టాయి. పోలీసులు బారీ భందోబస్తు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా రెండు రోజుల పాటు భక్తులకు అవస్థలు లేకుండా చేశారు. పోలీసులు కంట్రోల్ రూమ్ వద్దనే ఉండి భక్తులకు అసౌకర్యం కలగకుండా దర్శనభాగ్యం కలిగే విధంగా చర్యలు తీసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి ఊరేగింపు ప్రశాంతంగా జరిగింది. తొక్కిసలాట లేకుండా పట్టణంలో ఊరేగింపు సాగింది. జాతరకు మన రాష్ట్రం నుండే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణా భక్తులు తరలివచ్చారు. రాజకీయనాయకులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్రెడ్డి, సూళ్ళురుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంఎల్సీలు బల్లి కళ్యాణ్చక్రవర్తి, మేరిగ మురళీ, దేవదాయశాఖ ఇఓ శ్రీనివాసులరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి స్థానిక ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలను అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో మున్సిపల్ చైర్పర్సన్ నక్కా బాను ప్రియ, వైస్ చైర్మన్ శాతరాసి బాలయ్య వెంకటగిరి పట్టణ ప్రముఖులు విచ్చేసి మొక్కలను తీర్చుకున్నారు.

'మీడియాకు సంకెళ్లు' దారుణం

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్

న్యూస్ క్లిక్పై ఆంక్షలు , దాడులను నిరసిస్తూ గురువారం పలమనేరు అంబేద్కర్ సర్కల్ వద్ద జర్నలిస్టు పెడరేషన్ నేతృత్వంలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ప్రజాసంఘాల నేతృత్వంలో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. పత్రిక స్వేచ్ఛను కాపాడాలంటూ నినాదాలు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతికా స్వేచ్ఛపై దాడులు చేస్తూ రాజ్యాగాన్ని అపహాస్యం పాలు చేస్తున్నాయని జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు గోపి అన్నారు. సామాన్య, మధ్యతరగతి హక్కులను ప్రశ్నించడంతో పాటు మతోన్మాదం వల్ల కలిగే ప్రమాదాన్ని తెలియజేసిన న్యూస్క్లిక్ కార్యాలయాలు, సిబ్బందిపై దాడులు చేయడంతో ప్రతికాస్వేచ్ఛను హరించేలా కేంద్రంలోని మోడి సర్కార్ ప్రయత్నిస్తోందన్నారు. జర్నలిస్టుల ఆందోళనకు సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్పొరేట్సంస్థలకు ఊడిగం చేస్తున్న మోడి ప్రభుత్వం ప్రతికా స్వేచ్ఛపై దాడులకు పూనుకుంటోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంబేద్కర్ రాజ్యాగం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతికా స్వేచ్ఛను హరించేలా దాడులకు పూనుకుంటోదన్నారు. ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు, మేధావులు ప్రతికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడులను ఖండిచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మునిరత్నం, సివస్ ప్రసాద్, దివ్య, దాము, రామాంజనేయులు, బాలసుబ్రమణ్యం, రాజేష్, మురళి, అశ్వర్ధనారాయణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల దౌర్జన్యం నశించాలి : సిపిఎం

ప్రజాశక్తి- గూడూరు టౌన్

న్యూఢిల్లీలో 'న్యూస్ క్లిక్' కార్యాలయం జర్నలిస్టుల నివాసాలపై దాడులను ఖండిస్తూ గురువారం గూడూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మీడియాతో పట్టణ కార్యదర్శి జోగి.శివకుమార్ మాట్లాడుతూ పాత్రికేయ స్వాతంత్రాన్ని గౌరవించడం తెలియని హేతుబద్ధమైన, విమర్శలను లేదా దేశ వ్యాప్త వ్యతిరేక ప్రచారంగా పరిగణించే కేంద్ర ప్రభుత్వ పాలకుల దౌర్జన్యం నశించాలని, ఈ దుర్మార్గపు చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. భారత రాజ్యాంగ ప్రకారం పాత్రికేయ స్వేచ్ఛను, వారి జీవితాల కోసం తాము పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.వి రమణయ్య, ఎస్.సురేష్, అడపాల ప్రసాద్, బి.గోపీనాథ్, డి. కోటేశ్వరరావు, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


న్యూస్క్లిక్పై దాడులను నిరశిస్తూ ధర్నా చేస్తున్న జర్నలిస్టులు


దోమలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ప్రాణాంతక జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -యాదమరి:దోమలను అరికట్టడం వల్లనే ప్రాణాంతక జ్వరాల నుండి బయటపడతామని యాదమరి సి హెచ్ ఓ లక్ష్మీనారాయణ ప్రజలకు వివరించారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆరి మాకులపల్లి గ్రామంలో లార్వా సర్వే స్ప్రేయింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలని, నిరుపయోగంగా ఉన్న పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, రుబ్బు రోళ్ళు లాంటివి నివాస గృహాలకు దూరంగా వేయాలన్నారు. అలా లేని పక్షంలో వర్షపు నీరు వాటిలో నిల్వ ఉంటాయని అందులో దోమలు లార్వాలను విడిచిపెట్టడం ద్వారా దోమలు వ్యాప్తి విస్తృతమవుతుందన్నారు. దోమ కాటు వల్ల ప్రాణాంతకమైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటి జ్వరాల బారిన ప్రజల పడతారన్నారు. గతంలో ఆరిమాకులపల్లి గ్రామంలో మలేరియా కేసు నమోదు కావడం వలన ఇక్కడ ప్రతినెల సర్వే స్ప్రేయింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సిహెచ్ఓ లక్ష్మీనారాయణ వివరించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పరిశుభ్రత పాటించి ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త ప్రియ కుమారి, ఆశా కార్యకర్తలు భువనేశ్వరి, రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు కె.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. స్పెషలిస్ట్ జనరల్ మెడిసిన్ డాక్టరు శికార రెడ్డి , బైరెడిపల్లి మెడికల్ ఆఫీసర్ శాలిని , పి.హెచ్.సి. డాక్టరు పద్మావతి, డాక్టరు చాందినీ ఆధ్వర్యంలో గొల్లచిమనపల్లి సచివాలయంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో మొత్తం 250 మంది చికిత్స పొందారు. రక్తపరీక్షలు155మందికి, 81 మందికి కంటి పరీక్షలు, 7(ఏడు)రకాల ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు.105 రకాల మందులు పంపిణీ చేశారు.15 మంది గర్భిణులు, బాలింతలు, పిల్లలు వారివారి బంధువులు, సమస్యలు తెలిపి మెరుగైన వైద్యం అందుకున్నారు. ఇంకా మెరుగైన వైద్యం కోసం 10మందిని ఉన్నత నెట్ వర్క్ హాస్పిటల్సుకు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ.రెడ్డెప్ప ,బైరెడ్డిపల్లి మండల తహశీల్దార్ కుమార స్వామి, గొల్లచేమనపల్లి సర్పంచ్ జాన్సి నాగభూషణం రెడ్డి, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


వెదురుకుప్పంలో

వెదురుకుప్పం: మండలంలోని, వరాంబేడు సచివాలయం పరిధి. లోని ఆర్కేఎం పురం హైస్కూల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో , జడ్పిటిసి సభ్యులు సుకుమార్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశం లో మాజీ జడ్పిటిసి సభ్యులు, రాష్ట్ర వైసిపి నాయకులు, డిగ్రీ కళాశాల చైర్మన్ బండి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న కంటి వైద్య సురక్ష పథకం గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు ఒక వరం లాంటిది అద్భుత అవకాశం అని, అందరూ సద్వినియోగం చేసుకుని మీ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుణశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ జయరామమందడి, అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అందరికీ వైద్యం ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ అమరావతి అన్నారు గురువారం మండలంలోని సంక్రాంతి పల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం తుంబుకుప్పం ప్రాథమిక వైద్యులు లోహిత్ చెంగల్ రాయల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం దూరం కాకూడదని ఉద్దేశంతో అధునాతన వైద్యులచే వైద్య పరీక్షలు చేపడుతున్నామని ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యమనే తలంపుతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రారంభించాలన్నారు అనంతరం పలువురును వైద్యుల పరీక్షించి తగిన మందులు అందించారు ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ తహశీల్దార్ అనిల్ కుమార్, ఇన్చార్జి ఓపి ఆర్‌డి దుర్గాప్రసాద్ పంచాయతీ కార్యదర్శి ఉమాపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతిపురం: మండలంలోని అబకలదొడ్డి పంచాయతీ ప్రభుత్వ ఐటిఐ ఆవరణంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ భరత్ పాల్గొని ప్రజలకు ఎలాంటి ఖర్చు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందించడమే జగనన్న ముఖ్య లక్ష్యం అని జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి కుటుంబంలోని ప్రతి సభ్యుని ఆరోగ్య స్థితిని పరీక్షించి హెల్త్ కార్డులను మంజూరు చేస్తారని అన్నారు. అనంతరం జెడ్పిటిసి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ దండపాని, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ , కృష్ణమూర్తి వైస్ ఎంపీపీ పట్టాభి, పలువురు సర్పంచులు సేగంరాజు, డాక్టర్లు ప్రసాద్,ఉషారాణి వెంకటసాయి,పంచాయతీ కార్యదర్శిలు సుబ్రమణ్యం, ఆరిఫ్,వైసిపి నేతలు చిన్నప్ప,ఆది, ఏఎన్ఎంలు చెక్రియమ్మ హైమావతి, పుష్ప,ఎంఎల్ హెచ్ పి లు ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సోమల:సోమల మండలం పొదలకుంటపల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 325 మంది వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్లు ఎంపీటీసీ నాగభూషణం రెడ్డి తెలిపారు. సర్పంచి జయరాం అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పలు రకాల సేవలను పథకాలను గురించి వివరించారు. అనంతరం వైద్య సిబ్బంది కార్యక్రమానికి విచ్చేసిన పలువురిని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు మాత్రలు అవసరమైన వారికి అందజేశారు. 42 మంది అవ్వ తాతలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 9 మందికి మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని మనేంద్రం గ్రామ పంచాయతీ, అత్తికుప్పం గ్రామ నివాసి, టిడిపి సీనియర్ కార్యకర్త ఇ.కేశవ రెడ్డి మృతి పట్ల గురువారం టిడిపి నేతలు నివాళు లర్పించారు. ఆయన భౌతిక కాయానికి పూల మాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. టీడిపి అధిష్ఠానం ఆదేశాల మేరకు 10 వేలు రూపాయలు కేశవ రెడ్డి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడిపి మండల కన్వీనర్ ఆనంద రెడ్డి, కార్యదర్శి నరసింహులు, విశ్వనాథ్, రామలింగ రెడ్డి, రఫీ, వెంకట రమణ, ఆదిల్, వేలు తదితులున్నారు.

డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-పెద్దపంజాణి:మండలంలోని రాయలపేట గ్రామానికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ని ప్రజా సంఘాల నాయకులు చిన్న గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ ఆయన సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సలహాదారుడుగా పదవి ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని రాబోయే రోజుల్లో ఇంకా మంచి ఉన్నత పదవులు రావాలని కోరుకున్నట్లు అన్నారు.ఈ కార్యక్రమంలో గజేంద్ర, మొదలగు సామాజిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల సృష్టికర్త వైఎస్ జగన్

- ప్రతి గడపకూ లబ్ది
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి - కార్వేటినగరం :సంక్షేమ పథకాల సృష్టికర్త రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెడ్డి అని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం మండలంలోని కలికిరిండ్లు. ఇందిరాకాలనీ, ఆర్కేవీబీపేట, ఆర్కేవీబీపేట దళితవాడ, రాజుల కండ్రిగ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంపీపీ లతబాలాజీ,సర్పంచ్ దివ్య, వైస్ ఎంపీపీ మణెమ్మ ఆధ్వర్యంలో కొనసాగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు, విద్యార్థులకు పేదవారికి పెద్దపీట వేసి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. డ్వాక్రా మహిళలకు విడతలవారీగా సున్నావడ్డీ, రుణమాఫీ అమలు చేస్తున్నామని వైఎస్సార్ చేయూత ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ మహిళలకు 45 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.18.750 వారి ఖాతాల్లో జమచేస్తున్నామ్ని, కాపు నేస్తం ద్వారా రూ.15 వేలు, ఈబీసీ నేస్తం పథకం ద్వారా అగ్రవర్ణాల్లో ఉన్న పేదలకు రూ. 15 వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదలను పట్టించుకోలేదని, నేడు జగనన్న ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలను అందిస్తూ ప్రతి ఒక్కరికి లబ్ది చేకూరుస్తోందని, ఫ్యాన్ గాలికి చల్ల ఉంటున్నామని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కలికిరిండ్లు గ్రామంలో కొందరికి ఇళ్లు లేదని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన మంత్రి వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలు చేపట్టేల చూడాలని తహశీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు. ఇందిరా కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు మహిలు చెప్పడంతో స్పందించిన మంత్రి సీసీ రోడ్లతో పాటు, డ్రైనేజీ నిర్మాణానికి ఎంత ఖర్చుఅయినా సరే వెంటనే ప్రణాళిక సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ తీగలు ఇళ్లపైనే వెళ్లుతుందని చెప్పడంతో విద్యుత్ ఎస్ఈ తో ఫోన్ ద్వారా మాట్లాడి వెంటనే ఇందిరా కాలనీలో విద్యుత్ తీగలను తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆర్కేవీబీ పేట గ్రామంలోనూ డ్రైనేజీలు నిర్మాణాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రాజుల కండ్రిగ గ్రామంలో ఇళ్ల స్థలాలు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని పలువురు కోరడంతో వెంటనే అర్హులైన వారిని గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేయాలని డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అడుగడుగున మంగళ హారతులు, గజమాలలతో సన్మానాలు చేశారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి



విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి గ్రామాల్లో అడుగడుగున లబ్ధిదారులు ఘన స్వాగతం పలికారు. ఇందిరా కాలనీలో జిల్లా కార్యదర్శి గోపి, చలపతి, జ్యోతి, మాజీ ఎంపీటీసీ అన్నపూర్ణమ్మ, గోవిందస్వామి మంత్రిని గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఆర్కేవీబీపేట గ్రామంలో సర్పంచ్ దివ్య, దుష్యంత్, లోకనాథరెడ్డి గజమాలలు వేసి ఘనంగా సన్మానించారు. రాజుల కండ్రిగ గ్రామంలో వైస్ ఎంపీపీ మణెమ్మ, రామూర్తి, మణి, భారతి మంత్రికి గజమాలలు వేసి వీర తిలకం దిద్ది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, సోముశేఖరెడ్డి, బాస్కరెడ్డి, రమేష్రెడ్డి, సుధాకరరెడ్డి, వెంకట్రెడ్డి, విజయకుమార్ రెడ్డి,చిన్నబ్బరెడ్డి, మురళీ, జయరామ్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, జేసీఎస్ పురంధర్, చందురాజు, క్రిష్ణయాదవు, శేషాద్రి, అమీద్, ఎంపీడీవో మోహన మురళీ, ఏడీఈ నాగరాజు, పలువురు పాల్గొన్నారు.

తూనికలు కొలతల అధికారి తనిఖీలు

ప్రజాశక్తి- శాంతిపురం: శాంతిపురం మండల సచివాలయ కేంద్రంలో గురువారం తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టరు రమాదేవి సిబ్బందితో కలిసి రేషన్ డీలర్లకు సంబంధించిన తూకపు యంత్రాలను పరిశీలించి సంబంధించిన తునికరాళ్ళు, తూనిక పరికరాలకు రెన్యువల్ చేయించి వీటికి సంబంధించి రసీదులు ఇచ్చారు. మండలంలోని రేషన్ డీలర్లు అందరూ వారి తూనిక పరికరాలకు, సచివాలయ కేంద్రంలో వీరి కోసం ఏర్పాటుచేసిన తనిఖీలలో వారి పరికరాలను రెన్యువల్ చేయించుకున్నారు. వ్యాపారులు తూకాలలో మోసాలకు



పాల్పడితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ రమాదేవి తెలిపారు.

రాజారెడ్డి భౌతికకాయానికి నివాళులు

పజాశక్తి -సోమల:సోమల మండలం కామిరెడ్డి వారి పల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ మాజీ ఎంపీటీసీ లక్కసాని రాజారెడ్డి అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి గురువారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మధ్యాహ్నం రాజారెడ్డి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలను కలిపిన న్యాయమూర్తి

పజాశక్తి-పలమనేరు: పట్టణానికి కూత వేటు దూరంలో ఉన్న ఒక కమర్షియల్ ల్యాండ్ ప్రాపర్టీ విషయం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో పెండింగ్ లో ఉన్న దావాను గురువారం సీనియర్ సివిల్ న్యాయమూర్తి పి. శ్రీనివాసరావు ఇద్దరు కక్షిదారులను, వారి తరపున న్యాయవాదులను పిలిపించి ఇరు కక్షిదారులతో సామరస్యమైన పరిష్కారంతో ఏదైనా సాధించగలమని నచ్చజెప్పి వారిని రాజీమార్గంలో పరిష్కారం చేసుకోవాలని ఆదేశించారు. రాజీ పడితే ఇద్దరు గెలుపును పొందిన వారవుతారని తెలిపారు.అందుకు రెండు వైపులా కక్షిదారులు. వారిన్యాయవాదులు కె .లక్ష్మీపతి , కె .రెడ్డప్ప, సివిల్ న్యాయమూర్తి పి. శ్రీనివాసరావు ఈ సమస్యను పరిష్కరించారు. ఈ ప్రాపర్టీ విలువ సుమారు మూడు కోట్ల వరకు ఉండవచ్చని పరిగణించారు .ఈ కేసుతోపాటు మరో రెండు సివిల్ దావాలను పరిష్కరించారు .

జగనన్న ఆరోగ్య సురక్ష కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల ప్రత్యేక అధికారి మైనింగ్ డిడి ప్రసాద్, మండల ఎంపీడీవో కృష్ణయ్య, తహశీల్దార్ లోకనాథ పిళ్లై అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49. కొత్తపల్లి మిట్టలోని జిల్లా పరిషత్ ప్లస్ ఉన్నత పాఠశాల లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ను గురువారం కొత్తపల్లి సర్పంచ్ డి వి డిల్లెయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లో భాగంగా ఖరీదైన కళ్లజోళలను ఉచితంగా అందించడం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కే ఆ ఘనత సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి కుటుంబం లోని కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి నాణ్యమైన వైద్యం అందించడం మే జగనన్న ఆరోగ్య సురక్ష అన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే రోగులకు వైద్యం పూర్తిస్థాయిలో పరీక్షించి మందులు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఆర్ పురం వైద్యాధికారి డాక్టర్ సందీప్ రాజ్, డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి , డాక్టర్ గౌరీ , గ్రామ సెక్రెటరీ కోదండ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ విజయబాబు, కటిక పల్లి సర్పంచ్ మార్కొండయ్య , నాయకులు కార్యకర్తలు ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - రామకుప్పం: పేదలను ఆర్థికంక ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా గురువారం మండలం లోని ఓ నిరుపేద కుటుంబానికి సాయం అందించారు. బంధార్లపల్లి పంచాయతీ, కోడిగుండ్లపల్లికి చెందిన సుశీలమ్మ కు ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలు మేరకు సీఎం సంక్షేమ నిధి ద్వారా 50000వేల రూపాయలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, వైసీపి కన్వీనర్ బాబు రెడ్డి , కో కన్వీనర్ చంద్రా రెడ్డి, మాజి ఏఎంసి చైర్మన్ లలిత మురుగేష్ ,సర్పంచ్ రాజగోపాల్, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, డిటి అమర్నాథ్ పాల్గొన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు

ప్రజాశక్తి -చౌడేపల్లి :మండలంలోని ముగ్గురు ఉపాధ్యాయులు ఉత్తమ పురస్కారాలు అందుకున్నారు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారికి అవార్డులు దక్కాయి. ఈ మేరకు గురువారం కడప జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో కాగిత నుంచి ఏవి సుబ్రహ్మణ్యం, చౌడేపల్లి ఉన్నత పాఠశాల నుంచి ఏ భారతి పందిళ్ళపల్లి నుంచి టి నాగరాజులు కలెక్టర్ నుంచి ఉత్తమ అవార్డులు అందుకున్నారు. మండలంలో ముగ్గురు ఉపాధ్యాయులకు ఇంతటి గౌరవం దక్కడం పట్ల ఉపాధ్యాయులు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



చంద్రబాబు తోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి

మాజీ ఏఎంసీ చైర్మన్ జయ చంద్ర నాయుడు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: చంద్రబాబుతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందిందని మాజీ ఏఎంసీ చైర్మన్ జయ చంద్ర నాయుడు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తెలుగుదేశం కార్యాలయం ఆవరణంలో మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన గౌడ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుని గత నెల 10వ ఏదీ సిఐడి అదుపులో తీసుకొని అతనిపై స్కిల్ వే కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం సెంటర్ జైల్ కు రిమాండ్ ఖైదీగా ఉంచారని దీని జీర్ణించుకొని పలువురు మృత్యువాత పడుతున్నారని కానీ కోర్టు బెయిల్ మంజూరు చేయడంలో మీనమేషా లు లెక్కిస్తున్నారన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు వెంకటేశ్వర చౌదరి, లతా సర్పంచ్ కోకా ప్రకాష్ నాయుడు, మాజీ సర్పంచ్ కోదండ యాదవ్, కమలనాథరెడ్డి, వాణిజ్య విభాగ అధ్యక్షులు వంశీ చౌదరి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న టిడిపి నాయకులు

అడుగడుగునా అణిచివేతలు..కక్ష సాధింపులు

- మాజీ మంత్రి అమరనాథ రెడ్డి

ప్రజాశక్తి -గంగవరం: మండలంలోని మర్లపల్లి ఉల్లుకుంట మరిమాకనపల్లి సరమట్లపల్లి నాలుగు రోడ్లు గ్రామాలలో గురువారం ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి పర్యటించిన గ్రామాలలో ప్రజలు పలు సమస్యలను ఆయనకు ఏకరువు పెట్టుకున్నారు. ప్రధానంగా వైసిపి కక్ష సాధింపుతో టిడిపి సానుభూతిపరులనే అక్కస్సు తో రేషన్ కార్డులు, పింఛన్లను తొలగిచ్చేసారని, అర్హులైన చాలామంది లబ్ధిదారులకు ఇళ్ళు రాకుండా చేశారని మొరపెట్టుకున్నారు. మరి కొంతమంది తమను అక్రమంగా కేసులలో ఇరికించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇంకొంతమంది తమ భూములను అక్రమంగా లాక్కొని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇక అభివృద్ధి విషయంలో ప్రశ్నిస్తే వైసిపి నాయకులు తమపై దాడులకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై స్పందించిన మాజీమంత్రి రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని ప్రభుత్వం ఏర్పడ్డాక సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎవరు అధైర్య పడొద్దు అంటూ ఆయన వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అవార్డు పొందిన మదర్ థెరిసా కళాశాల విద్యార్థి

మదర్ థెరిసాకు అరుదైన గౌరవం

ప్రజాశక్తి -గంగవరం: అరుణాచల్ ప్రదేశ్ లోని ఎన్ఐటి ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో విద్యాసంస్థల్లో చదువుతున్న ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులకు అంతర్జాతీయ బెస్ట్ స్టూడెంట్ పేపర్ అవార్డు దక్కిందని కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఒక అరుదైన గౌరవం తమ కళాశాలకు దక్కిందని తమ విద్యార్థులు అంతర్జాతీయ సదస్సులో సమర్పించిన ఒక రీసెర్చ్ పేపర్ కు బ్రెయిన్ ఇంటర్ ఫేస్ ఫర్ హ్యూమన్ అప్లికేషన్ అంశంపై ప్రతిఫలం చూపించారన్నారు. ఈ అవార్డు దక్కినందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నామని ఇందుకు కృషిచేసిన విద్యార్థి పురుషోత్తం కు ప్రత్యేక అభివందనలు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యూనిఫాం పంపిణీ

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు మార్కెట్ యార్డు నందు చెక్‌పోస్టు సెక్యూరిటీ సిబ్బంది కి, వాచ్‌మెన్ లకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ యార్డు సెక్రటరీ సంజీవ్ కుమార్, సూపర్ వైజర్ జ్ఞానాంబ, వి.కోట యార్డు సూపర్‌వైజర్ శంకర్ రెడ్డి, యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలైకు ప్రత్యేక బస్సులు: డిఎం

ప్రజాశక్తి -పుంగనూరు: శబరిమలై అయ్యప్ప స్వామి దివ్య క్షేత్రం వెళ్లేందుకు ఆర్టీసీ డిపో నుండి బస్సులు నడుపుతామని అవసరమైన వారు పుంగనూరు డి ఎం ను సంప్రదించాలని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శబరిమలైకు ఏపీఎస్ఆర్టీసీ కార్పొరేషన్ ద్వారా కొత్త బస్సులు ,లగ్జరీ ,టు ప్లస్ టు, పుష్ బ్యాక్, ఎయిర్ సస్పెన్షన్ ,ఆడియో వీడియో, సెల్ చార్జింగ్ ,36 సీట్లు కెపాసిటీ గల బస్సులను నడుపుతామని తెలిపారు. ఇలాంటి సౌకర్యం ఉన్న బస్సులను పుంగనూరు డిపో నుండి నడుపుతామని చెప్పారు. కర్ణాటక, కేరళ, తమిళనాడు కు అంతరాష్ట్ర పర్మిట్లు కు, పార్కింగ్ కు ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని తెలిపారు. ఈ బస్సులలో 7 మందికి ఉచితంగా (సీటింగ్ కెపాసిటీ కాకుండా) పంపుతా మన్నారు. అదనంగా 12 గంటలు ప్రయాణ సమయం అనుమతిస్తామన్నారు. విశేష అనుభవం కలిగిన డ్రైవర్స్(ఇద్దరినీ) ను పంపుతామని తెలిపారు. మిగిలిన సమాచారం కోసం ఈ సెల్ నెంబరు 9100941850ను సంప్రదించాలన్నారు. ఒక బస్సు బుక్ చేసిన గురుస్వామి, ఏజెంట్ , ఎవరికైనా 2వేలు పారితోషికం ఇస్తామని తెలిపారు.

ఏపి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు: డిఇవో

ప్రజాశక్తి -పలమనేరు: విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని, దీనిని మనం చిత్తశుద్ధితో అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్ర రావు ఉపాధ్యాయులకు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం వైఎస్ఆర్ టీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన ఇంకనూ మాట్లాడుతూరాష్ట్రంలో జరుగుతున్న నాడు బి నేడు పనులు పాఠశాలలలో కలిపిస్తున్న మౌలిక వసతులు దేశానికే ఆదర్శ మన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా గౌరవ సలహాదారు సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాల చరిత్రలో విద్యారంగంలో ఇటువంటి విప్లవాత్మకమైన మార్పు లు రాలేదన్నారు. ఉపాధ్యాయులు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి వైఎస్ఆర్ టీఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యువరాజురెడ్డి, జయకాంత్, జిల్లా పరిషత్ సాంఘీక సంక్షేమ సలహా మండలి చైర్మన్ అమరనాథ్, పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, పలమనేరు నియోజక వర్గ పరిధిలోని మండల విద్యాశాధికారులు ప్రసం గించారు. అనంతరం విద్యాశాఖాధికారి, పలువు రు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైయస్ఆర్ టీఎఫ్ ఉపాధ్యక్షులు పుష్పావతి, కోశాధికారి ఏ.ఆర్. కుమార్, పలమనేరు డివిజన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు పట్టాభి రామయ్య, రోషన్ ఆలీఖాన్, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షులు గిరిధర మూర్తి,వడయార్లతో పాటు దాదాపు 300మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.





టిప్పర్ ఢీకొని యువకుడు మృతి - మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - వెదురుకుప్పం : మండలం ఎర్రగుంటపల్లి సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వెదురు కుప్పం ఏఎస్ఐ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజవర్గం పరిధిలోని ఎస్ఆర్ పురం మండలం, రాఘవ రాజాపురం గ్రామానికి చెందిన మనోహర్ చిన్న మోహన్ సొంత పనుల నిమిత్తం టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనంలో తిరుపతికి బయలుదేరారు. మార్గమధ్యంలో వెదురుకుప్పం మండలం ఎర్రగుంట కనుమ దగ్గర ఏనుగు వైపు నుంచి ఎపి 03 టిడి 7015 నంబర్ గల టిప్పర్ ఢీకొనడంతో ఢీ కొట్టడంతో మనోహర్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బతికి బయటపడ్డాడు. గాయపడిన ఇతనిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి దేహాన్ని బంధువులకు అప్పగించారు. ఏఎస్ఐ గజేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంసీ హాస్పిటల్లో వైఎస్ఆర్ పింఛను పంపిణీ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు దళిత వాడికి చెందిన గుండయ్య ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి ఇటీవల గురయ్యారు . గురువారం తమిళనాడు రాణి పేట సిఎంసి హాస్పిటల్ లో గుండయ్య చికిత్స పొందుతుండగా గంగాధర్ నెల్లూరు సచివాలయానికి చెందిన వాలంటర్ గా పనిచేస్తున్న ఎం.దీర్ఘ తన సొంత ఖర్చులతో ఆసుపత్రికి వెళ్లి పింఛన్ నిధులు అందించారు.



విద్యుత్ షాక్ తో మహిళ మృతి

ప్రజాశక్తి- ఎస్ఆర్ పురం : మంచినీరు బోరు స్టార్టర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మూలూరు గ్రామానికి చెందిన మండల మాజీ వైసిపి కన్వీనర్ అనంతరెడ్డి కోడలు సుభద్రమ్మ (45) గురువారం ఉదయం మంచినీరు బోరు స్టార్టర్ ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రాష్ట్ర ఆర్టిసి వైస్ చైర్మన్ ఎంసి విజయనందరెడ్డి మూలూరు గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులు రోధిస్తున్న తీరును చూసి డిప్యూటీ సీఎం నారాయణస్వామి కంట తడి పెట్టారు. కుటుంబ సభ్యులకు పార్టీ అన్ని విధాల అండగా ఉండి ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ఓదార్చి ధైర్యం చెప్పారు. వీరి వెంట జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, కన్వీనర్ మణి నాయకులు గురువారెడ్డి జనార్ధన్, మణి లోకయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

తగ్గిన వేరుశనగ సాగు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ప్రస్తుత సీజన్లో వేరుశనగ పంట సాగు తగ్గుముఖం పట్టినది గత సంవత్సరంలో 4వేల ఎకరాల్లో పంట సాగు చేయగా ఈ సంవత్సరం పంట సాగులో 800 ఎకరాలు పంటను సాగు చేశారు. రైతులు పంటలపై తగ్గుముఖంతో పంటల సాగు చేయకుండా ఉన్నారని పలువురు రైతులు వాపోయారు. వ్యవసాయ అధికారి చిట్టిబాబు మాట్లాడుతూ గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం పంట సాగు తగ్గుముఖం పట్టిందని అడవి జంతువులు, కోతులతో పంటను దెబ్బతింటున్నాయని రైతులు పంట సాగుకు వెచ్చించే ఖర్చు కూడా తిరిగి రాకుండా పోవడంపై పంటలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపడం లేదని అన్నారు. ప్రతి గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన పంట దిగుబడుల గురించి తెలియపరుస్తూ ఎరువులను రాయితీలతో అందిస్తున్నామన్నారని, కానీ అడవి జంతువులు కోతుల బెడదతో పంటలు సాగు చేయకపోవడం వేరుశనగ పంట తగ్గుముఖం పడుతోందన్నారు.

వెంకట్రామప్ప కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -శాంతిపురం: రాళ్ళబూదుగూరు పంచాయతీ సాతు గ్రామానికి చెందిన వెంకట్రామప్ప కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. వెంకట్రామప్ప కుటుంబానికి వైసీపీ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మృతుడి కుటుంబానికి అంతక్రియల ఖర్చుల కోసం ఎమ్మెల్సీ భరత్ పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాళ్ళ బూదుగూరు గ్రామ సర్పంచ్ లక్ష్మీ మురుగేశ్, మండల కో ఆప్షన్ నిసార్,వైసీపీ నేతలు రమేష్, అప్పిరెడ్డి గోవిందరెడ్డి, రఘుపతి, వార్డ్ మెంబర్ రంగారెడ్డి, పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.